కాంగ్రెస్‌కు ఓటేస్తే మునుగుడే

పాడిరైతుల బాకీ పైసలివ్వండి

- 80 కోట్లు బకాయి పెడతరా?
- 45 రోజుల బిల్లులు పెండింగ్‌లో పెడితే పాడి రైతులెలా బతికేది?
- వడ్డీలు, కిస్తీలు ఎలా కడతారు?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): పాడి రైతులకు 45 రోజుల పెండింగ్ బిల్లులు రూ.80 కోట్లను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 45 రోజులైనా బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 45 రోజులు బిల్లులు చెల్లించకపోతే పాడి రైతులు బతికేది ఎలా? అని ప్రశ్నించారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు, కిస్తీలు ఎలా కడతారు? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు రాసిన లేఖ పూర్తిపాఠం ఇది.. 'రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మందికిపైగా పాడి రైతులు పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడి, ప్రభుత్వం నడిపే విజయ డెయిరీకి నిత్యం పాలు పోస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు చెల్లించేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో బిల్లుల చెల్లించడం లేదు. 45 రోజుల పాల బిల్లులు పెండింగులో ఉన్నాయి. దాదాపు రూ.80 కోట్ల వరకు ప్రభుత్వం పాడి రైతులకు చెల్లించాల్సి ఉన్నది. బ్యాంకుల్లో, మహిళా సంఘాల్లో, వడ్డీ వ్యాపారుల దగ్గర వివిధ మార్గాల ద్వారా అప్పు చేసి పాడి రైతులు పశువులు కొనుగోలు చేశారు. అప్పుల కిస్తీలు క్రమం తప్పకుండా కట్టుకోవాల్సి ఉన్నది. పశువులకు దాణా, కాల్షియం, మందులు ఇతరత్రా సామగ్రి కూడా రోజూ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పాడి పశువులను పోషిస్తున్న వారంతా పేదలు, మధ్యతరగతి ప్రజలే. ఏ రోజు కష్టంతో ఆ రోజు వెళ్లదీసుకునే వారే. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తీసుకున్న అప్పుకు వడ్డీ కూడా కట్టలేని పరిస్థితి. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిన విధంగానే ప్రతీ 15 రోజులకోసారి బిల్లులు చెల్లించాలని, పెండింగులో ఉన్న రూ.80 కోట్ల బిల్లులను ఒకేసారి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను' అని లేఖలో పేర్కొన్నారు.

రేవంత్ పార్టీగేట్లు కాదు.. ప్రాజెక్టు గేట్లు తెరువు

- పేగులు మెడలో వేసుకునుడు కాదు.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చు
- రాష్ట్రానికి బీజేపీ చేసింది గుండుసున్నా
- కాంగ్రెస్, బీజేపీకి ఎందుకు ఓటేయాలి?
- గజ్వేల్ నియోజకవర్గ పార్టీ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 02(నమస్తే తెలంగాణ ప్రతినిధి): వందరోజుల పాలనను రెఫరెండంగా చూపించి ప్రభుత్వం మనల్ని మోసం చేసే అవకాశం ఉన్నదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతామని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డికి ఎంతసేపు ఢిల్లీకి పోయిరావడం తప్ప ఈ ప్రాంత రైతుల గోస పట్టడం లేదని విమర్శించారు. పార్టీ గేట్లు ఎత్తుడు కాదని, ప్రాజెక్టు గేట్లు తెరవాలని సీఎంకు సూచించారు. మంగళవారం మెదక్ పార్లమెంటు పరిధిలోని గజ్వాల నియోజకవర్గపార్టీ సన్నాహక సమావేశంలో మెదక్ లోక్‌సభ అభ్యర్థి పీ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ గేట్లు తెరిచి కూడవెల్లివాగుకు నీళ్లిస్తే గజ్వేల్, దుబ్బాక, ఇతర ప్రాంతాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. పేగులు మెడలో వేసుకోవడం కాదని, పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రేవంత్‌రెడ్డిని కోరారు. మానవబాంబు అవడం కాదని, మనిషివి అయితే పంట నష్టపోయిన రైతులను, ఆటోడ్రైవర్లను ఓదార్చాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీనైనా ప్రభుత్వం నెరవేర్చిందా? అని ప్రశ్నించారు. రూ. 2 లక్షల రుణ మాఫీ, రూ. 4 వేల పెన్షన్, తులం బంగారం ఇవ్వక పోయినా ప్రజలు అంగీకరించి తమకు ఓటువేస్తారని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటున్నదని ఎద్దేవా చేశారు. హామీలు ఇచ్చి నెరవేర్చని కాంగ్రెస్‌కు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నేతలను హామీలపై నిలదీయాలని సూచించారు. గజ్వేల్ గడ్డమీద ఈర్ష్య పెంచుకున్న కాంగ్రెస్, బీజేపీకి ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీనీ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. 100 రోజుల కాంగ్రెస్ పార్టీ బాండ్‌పేపర్ పాలనలో అన్నీ ఉద్దెర మాటేలనని దుమ్మెత్తిపోశారు. రూ. 2 లక్షల రుణమాఫీ అయితే కాంగ్రెస్‌కు, లేదంటే కారుకు ఓటెయ్యాలని కోరారు. డిసెంబర్ నుంచే మన అక్కచెల్లెళ్లకు ప్రతినెల రూ.2500 ఇస్తామన్న మొదటి హామీని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు.

బీజేపీ ఈ రాష్ట్రానికి ఏం చేసింది?

కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసింది శూన్యమని హరీశ్‌రావు విమర్శించారు. బీజేపీ చెప్పింది వింటే జోడీ, లేకుంటే ఈడీ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2 కోట్ల ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను బీజేపీ మోసం చేసిందని మండిపడ్డారు. పదేండ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రెండింతలు చేసి ఎన్నికలకు ముందు 2 రూపాయలు తగ్గించిందని విమర్శించారు. తెలంగాణ రైతుల కోసం పదేండ్లు కష్టపడి కాళేశ్వరం కట్టి నీళ్లు అందించిన మహానీయుడు మన కేసీఆర్ అని కొనియాడారు. ఈ పదేండ్ల కాలంలో గుంట పొలం కూడా ఎండిపోలేదని గుర్తుచేశారు. నేడు ఎక్కడ చూసినా ఎండిపోలాలు, కాలిపోయిన మోటార్లే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గజ్వేల్ అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరుచేస్తే అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మొత్తం రద్దుచేసి గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి బుద్ధిమంతుడైతే గజ్వేల్‌ను రూ.300 కోట్లతో అభివృద్ధిచేసి మేం చేశామని చెప్పుకోవాలని సవాలు విసిరారు. మన నోట్లో మట్టికొట్టిన కాంగ్రెస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. గజ్వేల్ గౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తు మనదేనని, తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు వివాదాలను పక్కనపెట్టి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పులివెందులకు వైఎస్సార్, కుప్పానికి చంద్రబాబు ఎలాగో, గజ్వేల్‌కు కేసీఆర్ అలాగే అని.. గజ్వేల్ కేసీఆర్ అడ్డా అని మరోమారు నిరూపించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హరీశ్ హెచ్చరిక.. కాల్వలో కదలిక

మొదటిపేజీ తరువాయి...

చేసి, 10 వేల ఎకరాల్లో పంటలు కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం.' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించిన రెండు గంటల్లోనే సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి కూడవెల్లి వాగులోకి కాళేశ్వర జలాలు పరుగులు పెట్టాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు సిద్దిపేట కలెక్టర్‌కు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి జిల్లా రైతుల పక్షాన వినతి పత్రం అందించారు. కూడవెల్లి వాగులోకి వెంటనే మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వెంటనే తేరుకున్న ప్రభుత్వం మధ్యాహ్నం 1 గంట తర్వాత మల్లన్నసాగర్ నుంచి కూడవెల్లి వాగులోకి 800 క్యూసెక్కుల నీటిని నీటి పారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. దీంతో సుమారు 15 వేల ఎకరాలకు భరోసా లభించింది. ప్రస్తుతం మల్లన్నసాగర్‌లో 10 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఫిబ్రవరి మాసంలో తొలి విడతగా అప్పర్ మానేరు వరకు 0.5 టీఎంసీల నీటిని, కూడవెల్లి వాగుకు 0.3 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. రెండో దశలో మంగళవారం మరోసారి నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు వివరించారు. మొత్తంగా హరీశ్‌రావు దెబ్బకు ప్రభుత్వం దిగివచ్చిందని, బీఆర్ఎస్ పోరాటం వల్ల మాకు సాగునీరు వచ్చిందని..మా పంటలను పండించుకుంటాం అని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంటలెండబెట్టిన పాపం కాంగ్రెస్‌దే

- ప్రభుత్వ పాలనను గాలికొదిలింద్రు
- 13న చేవెళ్లలో కేసీఆర్ సభ
- మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి

షాబాద్, ఏప్రిల్ 2: యాసంగి పంటలను ఎండబెట్టిన పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. ఈ నెల 13న చేవెళ్లలో కేసీఆర్ పాల్గొనే బీఆర్ఎస్ బహిరంగ సభ కోసం మంగళవారం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి పట్టణంలోని ఫరా ఇంజినీరింగ్ కాలేజీలో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా అయిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కోతలు ఏవిధంగా ఉన్నాయో ప్రతి రైతుకు తెలుసునని చెప్పారు. గతంలో అదునుకు ఎకరాకు రూ.10 వేలు రైతుబంధు ఇచ్చేవారని, కానీ ఇప్పుడు రైతుబంధు పడని రైతులు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. వేసవిలో ఏర్పడే తాగునీటి సమస్యను ఎలా పరిష్కరించాలో రాష్ట్ర పాలకులకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. రైతుల కష్టాలు తెలుసుకోవడానికి, ఎండిన పంటలను పరిశీలించడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లాల పర్యటనకు వెళ్లనున్నారని తెలియగానే కాల్వల్లో నీళ్లను వదిలారని తెలిపారు. దీంతో సాగు, తాగునీరు ఉన్నా కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ వ్యవహారిస్తున్న విషయం బయటపడిందని చెప్పారు. చేవెళ్లలో జరిగే కేసీఆర్ సభకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల లోక్‌సభ స్థానంలో భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ బీసీ నేతగా కేసీఆర్ తనకు ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించారని, ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుకను వినిపిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, రాజు గౌడ్, బాల్‌రాజ్, ప్రభాకర్, యాదగిరి, చంద్రారెడ్డి, శివప్రసాద్, శేఖర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో గంగుల, సత్యవతి రాథోడ్, పల్లా, వివేకానంద, కౌశిక్‌రెడ్డి, సుమన్, వివేకానంద, సుభాష్‌రెడ్డి

ఎకరానికి 25 వేలు ఇవ్వండి

- పంటలు ఎండి నష్టపోయిన రైతును ఆదుకోవాలి
- ఈసీ అనుమతితో రుణమాఫీ చేయాలి
- యాసంగి వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలి
- రైతు సమస్యలపై సీఎస్‌కు బీఆర్ఎస్ వినతి
- కక్ష సాధింపు ధోరణిలో ప్రభుత్వం
- కేసీఆర్ సీఎంగా ఉంటే ఎకరం ఎండేది కాదు: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే రాష్ట్రంలో ఎకరం పంట కూడా ఎండనిచ్చేవారు కాదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. నీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రైతాంగం పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం అనుమతి తీసుకొని రైతుల రుణాలను మాఫీ చేయాలని, తాము ఇందులో ఎలాంటి జోక్యం చేసుకోబోమని స్పష్టంచేశారు. మంగళవారం ఆయన తెలంగాణభవన్‌లో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. గత 15 రోజులుగా బీఆర్ఎస్ పార్టీ పోలాలకు వెళ్లి, పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, అనుభవ రాహిత్యంతో రైతులు సంక్షోభంలోకి వెళ్లారని ఆందోళన వ్యక్తంచేశారు. నీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కేసీఆర్ హయంలో చెక్‌డ్యామ్‌లు నిర్మించి కాళేశ్వరం నీళ్లను అలందించామని వివరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఒక్క ఎకరం కూడా ఎండనిచ్చేవారు కాదని పేర్కొన్నారు. కరీంనగర్‌కు కేసీఆర్ వస్తున్నారని తెలిసి గాయత్రి పంప్ ద్వారా నీళ్లను లిఫ్ట్ చేసి కాలువలకు వదిలారని పేర్కొన్నారు.

రేవంత్‌కు రైతుల సోయి లేదు

రేవంత్‌రెడ్డికి రైతులు ఉన్నారన్న సోయి కూడా లేదని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఢిల్లీకి డబ్బులు పంపించడంపైనే దృష్టి పెడుతున్నారని, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతిదానికీ నోరు పారేసుకోని కేసీఆర్‌పై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞత లేకుండా మాట్లాడుతున్నారని, భట్టి విక్రమార్కకు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రైతుల గురించి తెలియదని విమర్శించారు. పత్రికలకు లీక్‌లు ఇచ్చి పెద్దగా రాయించి బతుకుదామని అనుకుంటున్నారని, తెలంగాణ రాక ముందు ఇంతకంటే ఎక్కువ కుట్రలు చేశారని దుయ్యబట్టారు. సాగునీరు, తాగునీరు ఎలా ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. రైతుబంధు డబ్బులు అందక రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి తీసుకోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

సీఎస్‌కు వినతిపత్రం

రాష్ట్రంలో రైతాంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రం అందజేసింది. రాష్ట్రంలో రైతులను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుబంధు కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని, రూ.రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రూ.500 బోనస్ చెల్లించి, ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని, తక్షణం కాలువలు, చెరువుల కింద ఉన్న పంటలకు నీటిని విడుదల చేయాలని కోరారు. మంగళవారం సచివాలయంలో సీఎస్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతిరాథోడ్, మాజీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు వీరల్, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎం రమేశ్‌రెడ్డి ఉన్నారు.

కేసీఆర్ సీఎంగా ఉంటే ఇంత బాధ ఉండేదికాదని రైతులు చెప్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం మారిన 100 రోజుల్లోనే 2014 కంటే ముందటి పరిస్థితులు వచ్చాయని జగదీశ్‌రెడ్డి విమర్శించారు.

రైతులకు శాపంగా రేవంత్

- కేసీఆర్ సింహంలా బయటకు వచ్చారు
- దొంగల ముఠా నాయకుడు రేవంత్‌రెడ్డి
- ఒక కులాన్నే టార్గెట్ చేస్తున్నారెందుకు?
- కడియం కావ్యకు డిపాజిట్ దక్కదు
- కడియం, దానం, విజయలక్ష్మి పదవులకు రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ నేతలు పాన్నాల, దాసోజు, బాల్క సుమన్, గ్యాదరి కిశోర్ ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రైతాంగానికి సీఎం రేవంత్‌రెడ్డి శాపంగా మారారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడితే ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని, ప్రజాక్షేత్రంలోనే నాలుక చీరేస్తారని హెచ్చరించారు. రాష్ట్రంలో ఒక సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నదని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పలువురు నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నదని విమర్శించారు. కేసీఆర్ పర్యటనకు వెళ్లొచ్చేలోపు గాయత్రి పంపుహౌజ్ నుంచి నీళ్లు ఎందుకు వదిలారని ప్రశ్నించారు. సాగు, తాగునీటిపై కాంగ్రెస్ నేతలు ముఖాముఖి చర్చకు వస్తే తాను సిద్ధమని సవాల్ చేశారు. డిసెంబర్ నుంచి మార్చి వరకు తుపాకులగూడెం నుంచి 48 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసింది వాస్తవం కాదా? వీటిని ఎందుకు ఎత్తిపోయలేదు? అని ప్రశ్నించారు. ఇందులో అత్యధిక నీరు ప్రాణహిత, మేడిగడ్డ నుంచి వచ్చిందేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఉన్న నీటిని ఎలా వాడుకోవాలనే దానిపై ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదని మండిపడ్డారు. దేవాదుల ద్వారా 22 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉన్నా, ప్రభుత్వం స్పందించకే సమ్రద్రంలో కలిశాయని ఆవేదన వ్యక్తంచేశారు.

కేసీఆర్ సింహంలాగా వచ్చారు: దాసోజు

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి నిస్సిగ్గుగా కేసీఆర్‌పై మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. రేవంత్ అన్నం తింటున్నాడా? గడ్డి తింటున్నాడా? బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడ్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ సన్నాసిగా చిల్లరలెక్కలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయం 1.12 లక్షల నుంచి 3.17 లక్షలకు పెరగడం.. విధ్వంసమా? అని సీఎంను ప్రశ్నించారు. రైతులు పంటలను ఎందుకు తగలబెడుతున్నారో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దమ్ముంటే అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డిని, హోంశాఖ కార్యదర్శిని విచారించాలని సవాల్‌చేశారు.

ఒక సామాజికవర్గాన్నే టార్గెట్ చేస్తున్నరు

ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో ఒక సామాజికవర్గాన్నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. తుక్కుగూడ వెళ్లి తుప్పుపట్టిన మనిషిలా రేవంత్ మాట్లాడారని ఎద్దేవా చేశారు. వరంగల్‌లో కడియం కావ్యకు డిపాజిట్ దక్కదని హెచ్చరించారు. మేయర్ పదవికి గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే పదవికి కడియం శ్రీహరి, దానం నాగేందర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రేవంత్‌రెడ్డి దొంగల ముఠా నాయకుడని గ్యాదరి కిశోర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఒక్కరోజు బయటికొస్తేనే కాంగ్రెస్ మంత్రులు ఉలిక్కిపడుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నర్సింహారెడ్డి, తుంగ బాలు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పొన్నాల. చిత్రంలో సుమన్, కిశోర్, శ్రవణ్

పాపన్నగౌడ్‌ను బీసీలు స్ఫూర్తిగా తీసుకోవాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, జాజులశ్రీనివాస్, పల్లె రవికుమార్ తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 2: సర్వాయి పాపన్నగౌడ్ పోరాటాన్ని బీసీలు స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బహుజన కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా ఆత్మ బలిదాన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఇతర నేతలతో కలిసి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్వాయి పాపన్న, కుమ్రంభీం, చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందని గుర్తుచేశారు. చట్టసభల్లో రిజర్వేషన్లు, కులగణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. చట్టసభల్లో రిజర్వేషన్లు వస్తేనే ఆ జాతులు బాగుపడుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దీనికోసం బీసీలు జాతీయస్థాయిలో ఐక్య పోరాటాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యులు కిశోర్ కుమార్‌గౌడ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేశ్‌చారి, గౌడ సంఘాల రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాబాగౌడ్, జై గౌడ జాతీయ సంఘం అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



రాష్ట్రంలో ఉన్న ఆడ పిల్లలందరికీ కలిపి తులం బంగారం ఇస్తామన్నాం అని చెబుదాం సార్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.7°c	21.7°c
రంగారెడ్డి	42.6°c	20.7°c
మెదక్	41.9°c	22.6°c
నిజామాబాద్	40.9°c	27.1°c
మహబూబ్‌నగర్	40.6°c	27.1°c
నల్లగొండ	40.5°c	24.2°c
ఖమ్మం	40.0°c	24.0°c
కరీంనగర్	40.0°c	27.0°c
హైదరాబాద్	39.7°c	25.8°c
వరంగల్	39.0°c	25.0°c

నిప్పులు కక్కుతున్న భానుడు

- నిర్మల్‌లో 43.50 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- అన్ని జిల్లాల్లో 40 డిగ్రీలు దాటిన ఎండలు

హైదరాబా